క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణంలో జాప్యం తగదు

ఇన్‌చార్జి ఎంపీడీఓ జంగయ్యగౌడ్



కర్ణంగూడలో ముగ్గు పోసిన ఇన్‌చార్జి ఎంపీడీఓ

ఇబ్రహీంపట్నం/ఇబ్రహీంపట్నం రూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జాప్యం చేయొద్దని, నిబంధనల మేరకు నిర్మాణం చేపట్టాలని ఇబ్రహీంపట్నం మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ యెల్లంకి జంగయ్యగౌడ్ అన్నారు. సోమవారం కర్ణంగూడ, పోచారం, ఎల్మినేడు గ్రామాల్లో పలు ఇందిరమ్మ ఇళ్లకు ఆయన ముగ్గు పోశారు. అనంతరం మాట్లాడుతూ.. మండలానికి తొలివిడతగా 437 ఇళ్లు మంజూరు కాగా, అందులో కర్ణంగూడకు పది ఇళ్లు కేటాయించారని తెలిపారు. 600 ఎస్ఎఫ్‌టీ లోపు కొలతలతో ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఈ కొలతలను తీసుకుంటారని చెప్పారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు వెంటనే చేపట్టాలని, లేనిపక్షంలో అర్హుల జాబితాలోని ఇతరులకు ఇళ్ల బదలాయింపు జరుగుతుందని స్పష్టంచేశారు. నిర్మాణాన్ని బట్టి నాలుగు విడతలుగా డబ్బులు మంజూరు అవుతాయని, పనులు వేగవంతం చేసి లబ్ధిపొందాలని కోరారు. మండల పంచాయతీ అధికారి రఘు, గ్రామ కార్యదర్శి మమత తదితరులు పాల్గొన్నారు.

సమాధులు కూల్చినవారిపై చర్యలు తీసుకోండి



ఫిర్యాదు పత్రం చూపెడుతున్న బాధిత ప్రజలు

ఇబ్రహీంపట్నం రూరల్: సమాధులు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని కొంగరకలాన్ పట్టణ ప్రజలు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అనంతరం వారనాసి అంజయ్య, నిదానకవి జంగయ్య, నిదానకవి రాములు మాట్లాడుతూ.. తమ పూర్వికుల సమాధులు ఫిరోజ్‌గూడ సమీపంలో ఉండేవని, ఓ రియల్ ఎస్టేట్ సంస్థ వాటిని కూల్చివేసిందని, సదరు సంస్థపై తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



రాజు కుటుంబానికి సహాయం చేస్తున్న రాజు

ఇబ్రహీంపట్నం: తన స్నేహితుడు మంఖాల రాజు కుటుంబానికి బీఆర్‌ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జెర్కొని రాజు సోమవారం రూ.50 వేల ఆర్థిక సహాయం చేశారు. ఇబ్రహీంపట్టణానికి చెందిన రాజు.. ఇటీవల మృతి చెందాడు. అయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిత్రుడి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటానని, పిల్లల ఉన్నత చదువులకు అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో అంగత్‌కుమార్, గణేశ్, నూకల అశోక్, ప్రవీణ్, శ్రీకాంత్, భాను, జెలేందర్, సాయి, కిశోర్, శ్రీనులు పాల్గొన్నారు.

సర్కారు భూమిని కాపాడండి



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మాడ్గుల: క్రీడా మైదానాన్ని కబ్జా కోరుల నుంచి కాపాడాలని మండల పరిధి నల్లచెరువు గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఏఓ సునీల్ కుమార్‌కు ఫిర్యాదు పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రభుత్వ భూమిలో క్రీడా మైదానం ఏర్పాటు చేసుకున్నామని పేర్కొన్నారు. కానీ సదరు భూమి తమదేనంటూ గ్రామానికి చెందిన భూస్వామి ట్రాక్టర్‌తో దున్నాడని ఆరోపించారు. కబ్జాదారుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆ భూమిని కాపాడాలని కోరారు. అందులో మైదానం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. అంజయ్య, జంగయ్య ఉన్నారు.

బీరప్పస్వామి కల్యాణం

యాచారం: మండల పరిధి మల్కీజ్‌గూడ గ్రామంలో సోమవారం శ్రీ బీరప్పస్వామి, కామరాతి దేవీల కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. గ్రామంలోని కుర్మ కులస్తులు.. గొర్రెలను దేవాలయం వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్ పూజలు చేశారు.

‘చెత్త’శుద్ధి ఏదీ?



కొంగరకలాన్ తండాలో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు

కంపుకొడుతున్న కొంగరతండా

- చెత్తసేకరించని పారిశుద్ధ్య సిబ్బంది
- అడ్డగోలుగా వ్యర్థాల పారబోత
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: గిరిజన ప్రాంతంపై మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తండాలో చెత్త కుప్పలు పేరుకుపోయినా.. తొలగించకుండా చిన్నచూపు చూస్తున్నారు. కలెక్టరేట్ కార్యాలయానికి సమీపానే ఉన్నా.. తండా సమస్యలు పట్టడం లేదని, నివాసాల నడుమ వ్యర్థాలు పేరుకుపోయినా ఇటువైపు చూసేవారే కరువయ్యారని గిరిజనులు ఆరోపిస్తున్నారు.

చెత్త డబ్బాలు లేవు..

కొంగరకలాన్ తండాలో అధికారులు ఇప్పటి వరకు చెత్త సేకరణపై ఎలాంటి ముందోస్తు చర్యలు చేపట్టలేదు. కనీసం తడిపొడి చెత్త సేకరణ డబ్బాలు పంపిణీ చేయలేదు. పట్టణ కూడళ్లలో చెత్త సేకరణ, అనంతరం డంప్‌కోసం నిర్మాణాలు చేపట్టాలి. కానీ ఎక్కడ కూడా అలాంటి నిర్మాణాలు చేపట్టలేదని గిరిజనులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. చెత్త సేకరణకు సరైన ప్రణాళిక చేయకుండా ఎక్కడ పడితే అక్కడ విచ్చల విడిగా చెత్తను పారబోస్తున్నారని వాపోతున్నారు. దీంతో ఈగలు, దోమలు పెరిగి రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. స్వచ్ఛ భారత్ అభియాన్‌లో రాష్ట్ర స్థాయిలో అవార్డు తీసుకున్నప్పటికీ చిత్తశుద్ధి కరువైందని పేర్కొంటున్నారు.

పట్టించుకోవడం లేదు



గిరిజన తండాను అధికారులు పట్టించుకోవడం లేదు. అపరిశుభ్రత గురించి పలుమార్లు వారి దృష్టికి తీసుకెళ్లాం. అయినా ఫలితం శూన్యం. చెత్తసేకరణ సరిగా లేక.. తండాలో చెత్తకుప్పలు పేరుకుపోయాయి. దోమలు, ఈగలు పెరిగాయి. అసలే వర్షాకాలం. ప్రజలు రోగాల బారిన పడకముందే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి.

–కోలా నగేష్, మాజీ కౌన్సిలర్, కొంగరకలాన్ తండా

నిర్లక్ష్యం తగదు



గిరిజన తండాపై అధికారుల చిన్నచూపు తగదు. చెత్త కుప్పల గురించి పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించాం. అయినా పట్టించుకోవడం లేదు. కలెక్టరేట్‌కు సమీపానే ఉన్నా.. మా పరిస్థితి ఇంత దారుణంగా ఉంది. చెత్తాచెదారాన్ని తక్షణమే తొలగించాలి. ఎప్పటికప్పుడు ఇళ్ల నుంచి చెత్త సేకరించాలి.

– బాబులు, బీఆర్‌ఎస్ నాయకుడు, కొంగర

ఇళ్లమధ్యే..

ఆదిబట్ల మున్సిపాలిటీలోని 15 వార్డుల్లో ఐక్షైక తండా కొంగరకలాన్ తండా. కొంగరకలాన్‌లోనే ఐదు వార్డులు ఉన్నాయి. వీటికి గుండెకాయ లాంటిది. పురపాలికలో నిత్యం 10 టన్నుల చెత్త సేకరిస్తారు. కొంగరకలాన్‌లోనే రోజుకు 3 టన్నులకు పైగా తరలిస్తుంటారు. తండాలో టన్నుకు పైగా చెత్త ఉత్పత్తి అవుతోంది. కానీ.. చెత్త సేకరణకు పారిశుద్ధ్య సిబ్బంది రావడం లేదని గిరిజనులు పేర్కొంటున్నారు. దీంతో ఏం చేయాలో తెలియక ఇళ్ల సమీపాన, మధ్యలోనే తండావాసులు వ్యర్థాలను పారబోస్తున్నారని తెలిపారు.



ఉపముఖ్యమంత్రికి ఘనస్వాగతం



ఆమనగల్లు: డిప్యూటీ సీఎంకు స్వాగతం పలుకుతున్న నాయకులు

ఆమనగల్లు: అచ్చంపేట నియోజకవర్గానికి వెళ్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవిలకు సోమవారం ఆమనగల్లు పట్టణంలో కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇరువురికి శాలువాలు కప్పి సత్కరించారు. భారీగా బాణసంచా కాల్చారు. స్వాగతం పలికినవారిలో మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మండ్లి రాములు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, కాంగ్రెస్ నాయకులు వస్పుల శ్రీకాంత్, ఫరీద్, కృష్ణానాయక్, ప్రసాద్, కండె సాయి, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: నాగర్‌కర్నూల్ జిల్లాలోని బల్మూర్ మండలంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు వెళ్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు సోమవారం కడ్తాల్ మండల కేంద్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డితో పాటు, స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్ తదితరులు ఉన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాటం



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

మంచాల: కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమించాలని సీపీఎం మండల కార్యదర్శి రావుల జంగయ్య పిలుపునిచ్చారు. సోమవారం మంచాల మండలం ఆస్మత్‌పూర్ గ్రామంలో ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల కోసం, వారి సమస్యలపై పోరాడేది సీపీఎం పార్టేనని తెలిపారు. కార్మికుల హక్కుల కోసం ఈ నెల 30న కలెక్టర్ రేట్ ఎదుట నిర్వహించే ధర్నాలో శ్రామికులు పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కాళ్ల జంగయ్య, బక్కతట్ల ఐలయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల అందజేత

కందుకూరు: మండల కేంద్రంలోని వైఎస్సార్ మినీ స్టేడియంలో నిర్వహించిన నవతరం ప్రీమియర్ లీగ్ సీజన్–5 క్రికెట్ పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. మొదటి స్థానంలో నిలిచిన శివగౌడ్ ధోని జట్టుకు రూ.30వేల నగదుతో పాటు షీల్డ్‌ను ఎస్.శేఖర్‌గౌడ్ అందించారు. ద్వితీయ స్థానంలో నిలిచిన టి.అఖిల్ సోనూ జట్టుకు రూ.17వేల నగదుతో పాటు షీల్డ్‌ను డి.కృష్ణముదిరాజ్ అందజేశారు. ఈ సందర్భంగా నవతరం యూత్ అధ్యక్షుడు రాజశేఖర్‌గుప్తా మాట్లాడుతూ.. యువతను ప్రోత్సహించడానికి ఇలాంటి క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో యువకులతో కలిసి స్వచ్ఛంద కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో నవతరం యూత్ మాజీ అధ్యక్షులు ఎస్.వెంకటేశ్‌గౌడ్, టి.కార్తీక్, బి.దీక్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సందడి

ఆమనగల్లు: పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం ఘనంగా జరిగింది. స్థానిక వివేక విద్యా భారతి ఉన్నత పాఠశాలలో 1999– 2000 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న బాల్య మిత్రులందరూ.. 25 ఏళ్ల అనంతరం ఒకే వేదికగా సందడి చేశారు. ఆప్యాయంగా పలకరించుకుంటూ, నాటి జ్ఞాపకాలు గుర్తుకు చేసుకుంటూ కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులు ఏవీఎస్ శర్మ, పరందాములు, సంధ్య, కన్నాజీ, భీముడు, శ్రీలత, శివలింగంలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రసాద్, రమేశ్, రాములు, నరేశ్, సంతోష్, శ్రీకాంత్, విజయ్, రూపేశ్, రాఘవ, జగన్, అనిత, శివలీల, ప్రసన్న, లీల తదితరులు పాల్గొన్నారు.



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పంట మార్పిడితో నేలకు మేలు

వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ బి.పద్మజ



మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త పద్మజ

ఇబ్రహీంపట్నం: రైతులు పంట మార్పిడి తప్పనిసరిగా పాటించాలని, తద్వారా నేల, నీరు, వాతావరణం సమతౌల్యాన్ని కాపాడినవారమౌతామని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ పద్మజ తెలిపారు. సోమవారం తుర్కగూడలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తక్కువ పెట్టుబడి, ఎక్కువ దిగుబడి పొందే విధానాలను పాటించి, అవసరాన్ని బట్టి క్రిమిసంహారక మందులను వాడాలని రైతులకు సూచించారు. చెట్లను పెంచి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని చెప్పారు. విత్తనాలు, ఎరువులు, పరుగు మందు కొనుగోలు చేసినప్పుడు రసీదు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ రాంప్రకాశ్, మండల వ్యవసాయ అధికారి విద్యాధరి, ఏఈఓ సృజన, గ్రామ పంచాయతీ కార్యదర్శి మమత, పశువైద్యాధికారి ఆనంద్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు

ఇబ్రహీంపట్నం డివిజన్ ఏడీఏ సుజాత



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ

యాచారం: అధిక లాభాల ఆశతో నకిలీ విత్తనాలు విక్రయిస్తే బాధ్యులైన డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇబ్రహీంపట్నం డివిజన్ ఏడీఏ సుజాత హెచ్చరించారు. యాచారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం యాచారం, మంచాల డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విత్తనాలు, ఎరువుల కొరత సృష్టించి, అధిక ధరలకు అమ్మితే సహించేది లేదన్నారు. ఎమ్మార్పీ ధరకే విక్రయించి, రైతులకు రసీదు ఇవ్వాలని ఆదేశించారు. ధరల పట్టికను దుకాణాల ఎదుట ప్రదర్శించాలని, డిమాండ్ మేరకు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉంచాలని సూచించారు. కర్షకులను మోసం చేస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులు.. నిత్యం ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీలు చేసి, స్టాక్ బోర్డులు పరిశీలించాలని సూచించారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి రవినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి తోడ్పాటునందించండి

మంత్రి జూపల్లి, ఎంపీ మల్లురవికి కాంగ్రెస్ నాయకుల విన్నపం



మంత్రి, ఎంపీకి స్థానిక సమస్యలను వివరిస్తున్న నాయకులు

కడ్తాల్: మండల అభివృద్ధికి తోడ్పాటునందించాలని, సంక్షేమ పనులకు తగిన నిధులు మంజూరు చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవిని కాంగ్రెస్ నాయకులు కోరారు. సోమవారం కడ్తాల్ మండల కేంద్రానికి వచ్చిన మంత్రి, ఎంపీని డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్ తదితరులు కలిశారు. ముక్తామాధారం గ్రామంలో బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ ఏర్పాటు చేయాలని, మండల కేంద్రంలో అసంపూర్తిగా మిగిలిన ఎంపీడీఓ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని, ధాన్యం నిల్వ చేసుకోవడానికి గోదాములు నిర్మించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ నరేశ్‌నాయక్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, మాజీ ఎంపీటీసీలు వెంకటేశ్, లక్ష్మయ్య, రాములుగౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, శంకర్, నరేందర్, సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్పతినాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత జీవితం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



మదర్సాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

తలకొండపల్లి: విద్యతోనే ఉన్నత జీవితం ప్రాప్తిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. విద్యాధికులు అధికంగా ఉన్న ప్రాంతాలు వేగేవంతంగా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామంలో సోమవారం ముస్లిం నాయకులతో కలిసి ఆయన మదర్సాను ప్రారంభించి మాట్లాడారు. ముస్లిం మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మైనార్టీ విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేసి, న్యాయమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మదర్సా ఏర్పాటు చేసి, విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్న మౌలానా అబ్దుల్ కరీం షా ఖాద్రీని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్‌చైర్మన్ గుడూరు బాస్కర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, నాయకులు వెంకట్‌రెడ్డి, షాబుద్దీన్, అఫీజ్ తదితరులు ఉన్నారు.

దేశభక్తిని పెంపొందించేందుకే ర్యాలీ



తిరంగ ర్యాలీలో మాట్లాడుతున్న ఆచారి

జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి

ఆమనగల్లు: ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు తిరంగ ర్యాలీ నిర్వహించామని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి తెలిపారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతంతో ఆమనగల్లు పట్టణంలో సోమవారం జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. హనుమాన్ దేవాలయం నుంచి జాతీయ రహదారి వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం గాంధీచౌక్ వద్ద జరిగిన సమావేశంలో ఆచారి మాట్లాడుతూ.. పాకిస్థాన్ ఉగ్రవాద చర్యలకు వ్యతిరేకంగా భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిందని పేర్కొన్నారు. మన సైనిక బలానికి దాయదీ దేశం తలొగ్గిందన్నారు. ఉగ్రవాదంపై పోరు కొనసాగుతునే ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కండె హరిప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాంపాల్‌నాయక్, మాజీ వైస్ చైర్మన్ దుర్గయ్య, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు విక్రం రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు శ్రీశైలం, లక్ష్మణ్, భగీరథ్, మహేశ్, శ్రీధర్, చెన్నకేశవులు, పెద్దయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అడివయ్య ఆశయసాధనకు కృషి చేయాలి

స్వాతంత్య్ర సమరయోధుడు వర్ధంతిలో వక్తలు



అడివయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కుటుంబ సభ్యులు తదితరులు

ఇబ్రహీంపట్నం: విప్లవ నాయకుడుగా తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన త్యాగమూర్తి కామ్రేడ్ అడివయ్య అని వక్తలు కొనియాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటయోధుడు, స్వాతంత్య్ర సమరయోధుడు కామ్రేడ్ తోడే అడివయ్య వర్ధంతిని అయన మనుమరాలు వర్కాల మానస అధ్యక్షతన సోమవారం ఇబ్రహీంపట్నంలోని వైష్ణవి గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 1947 నుంచి 1951 వరకు అడివయ్య జైలు జీవితాన్ని గడిపారని తెలిపారు. దొరలకు, భూస్వాములకు, కుల వివక్షతకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటాన్ని మరువలేనిదన్నారు. అడివయ్య ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి జేబీ రాజు, కార్డియాలిస్ట్ డాక్టర్ గోపినాథ్, రిటైర్డ్ ఎస్పీ జాన్‌వెస్లీ, దంత వైద్యుడు మదన్, రిటైర్డ్ తహసీల్దార్ మల్లేశ్, మహిళా సంఘం నేతలు ఝాన్సీ, ప్రేమలత, అనసూయ, సీపీఎం నాయకులు సామేల్, మానస, కృష్ణయ్య, ఈగల రాములు, అడివయ్య కుమారుడు బాలచందర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నందిహిల్స్ అభివృద్ధికి కృషి

మీర్‌పేట: నందిహిల్స్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం కాలనీవాసులతో కలిసి స్థానికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలోని రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, త్వరలోనే తన కార్పొరేషన్ నిధుల నుంచి రోడ్ల అభివృద్ధికి రూ.6 కోట్లు, పార్కుల కోసం రూ.2 కోట్లు కేటాయిస్తానని హామీనిచ్చారు. భవిష్యత్తులో నందిహిల్స్‌ను మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు.



పత్తి విత్తనాలు విత్తుతున్న రైతు కూలీలు

కరుణించిన వరుణుడు.. పులకించిన కర్షకుడు

యాచారం: వరుణుడు కరుణిచండంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. నెల రోజుల క్రితం కురిసిన వర్షాలతో తమ భూములను చదును చేసుకున్న అన్నదాతలు.. రెండురోజులుగా కురుస్తున్న వానలతో యాచారం, చౌదర్‌పల్లి, చింతుల్ల, నస్దిక్‌సింగారం, తక్కళ్లపల్లి, మాల్, నల్లవెల్లి, చింతపట్ల గ్రామాల్లో విత్తనాలు విత్తుతున్నారు. రోహిణి కార్తెలో జొన్న విత్తితే మంచి దిగుబడి వస్తుందని కర్షకుల్లో నమ్మకం. ఈ నేపథ్యంలో తొలకరి వర్షాలతో జొన్నలు విత్తుతున్నారు.